

# అంకుల్ సామ్

## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

***రచనాకాలం: 1995 సంవత్సరం***

*(గత సంచిక తరువాయి)*

**వాణి లేని** ముప్పైరోజులు ముకుందానికి ఎంతో దిగులుగా అనిపించింది. సాయంత్రాలు బాపన్న ముకుందం గోదావరి బ్రిడ్జిమీదికి వెళ్ళేవాళ్ళు. వాళ్ళు ముగ్గురూ కలిసి అక్కడ మాట్లాడుకున్న మాటలు గుర్తుచేసుకునేవాడు ముకుందం.

"ప్రేమంటే ఇదేనేమో. సెక్స్‌కోసం కాదు. ఒక్కసారి వాణిని కొద్దిసేపు చూస్తే చాలనిపిస్తోంది" చెప్పాడు ముకుందం.

"ఆ అమ్మాయికి చెప్పేసెయ్ నిన్ను లవ్ చేస్తున్నానని."

"ఊహూఁ. ఆమె 'నో' అంటే భరించలేను"

"అనకపోవచ్చుగా?"

"అంటే?"

"అడిగితే కాని అమ్మయినా పెట్టదన్న సామెత ఉంది. నీ మనసులోని మాట చెప్పి తీరాలి ఆమెకి ఇష్టం ఉన్నా లేకపోయినా." బాపన్న చెప్పాడు.

"ఆ విషయం ఎలా చెప్పాలా?" అని ఆలోచించాడు ముకుందం. అతనికి గుర్తువచ్చింది. వాణి తన తల్లితండ్రుల మేరేజ్ ఏనివర్సరీకి గిఫ్ట్‌గా పంపించిన పుస్తకం. తన హేండ్‌రైటింగ్ బాగుంటుందని తన చేత రాయించి పంపించింది. తనూ అదే పద్ధతిలో ఆమెకి తన ప్రేమని తెలియచేయాలనుకున్నాడు. మర్నాడే డ్రాయింగ్ పేపర్లు కొనుక్కొచ్చి దాన్ని స్పైరల్ బైండింగ్ చేయించాడు.

మొదటి నాలుగు పేజీలు వదిలేశాడు.

అయిదో పేజీలో ఈ వాక్యం రాసి ఆ రోజు తారీఖు వేశాడు. "నేను మీ జీవితంలో ఓ ముఖ్యమైన భాగం అవుతానో లేదో తెలుసుకోవడానికి నేను మిమ్మల్ని అడగాలా? లేక జ్యోతిష్కుడ్ని అడగాలా?"

దానికింద చిలక జ్యోతిష్కుడి బొమ్మ వేశాడు.

తర్వాతి పేజీలో మర్నాడు ఇంకో వాక్యం రాసి దానికింద కూడా బొమ్మ గీశాడు.

"నా హృదయపు తాళం చెవి పోయింది. మీగ్గాని అది దొరికిందా?"

దానికింద తాళం వేసి ఉన్న ఆఠీన్ బొమ్మ గీశాడు. మూడోరోజు తారీఖు వేసి రాశాడు.

"మీ అమ్మకి ఎంతో అందమైన కూతురుందని, ఆమెని నేను ప్రేమిస్తున్నానని మీకెప్పుడయినా అనిపించిందా?"

కింద వాణి బొమ్మ గీశాడు. ముఖంలో పోలికలు వాణికి దగ్గరగా వచ్చాయి.

నాలుగోరోజు ఏం రాయాలా అని సాయంత్రందాకా ఆలోచించి ఇలా రాశాడు.

"మీ నవ్వంటే నాకిష్టం. ఆ మిలియన్ డాలర్ల స్మయిల్‌ని మీరెలా సాధించగలిగారు?"

కింద ఓ గుండ్రం గీసి, దానిలో పైకి రెండుచుక్కలు పెట్టి 'కింద 'యు' ఆకారంలో గీత గీశాడు. ఆ తలకి బాబ్డ్ హెయిర్ వేసాడు.

అయిదో పేజీలో ఆ రోజు తారీఖు వేసి రాశాడు.

"డియర్ వాణీ!

నేను నిన్ను ప్రేమిస్తున్నాను అన్న విషయం రోజుకో విధంగా చెప్పడానికే ఈ పుస్తకం. నీతో స్వయంగా చెప్పకపోయినా ఈ రోజు నుంచి రోజుకోరీతిలో చెపుతుటాను. నీవు నా ప్రేమని నిరాకరించవన్న నమ్మకం కలిగాక. దీన్ని నీకు ఇస్తాను.

"నువ్వంటే ఎందుకిష్టమో ఆలోచించినా నాకు బయటకు చెప్పే కారణం ఏమీ తట్టలేదు కాబట్టి రాయడంలేదు.

నీవు నా దానివి అవ్వాలనుకునే

**ముకుందం"**

పి.ఎస్. నాకు చక్కెర వ్యాధి వచ్చినా సరే, నీలాంటి తియ్యటి అమ్మాయిని ప్రేమించకుండా ఉండలేను.

కింద ఆ వాక్యానికి సరిపడే బొమ్మ గీశాడు షుగర్ క్యూబ్స్‌తో ఓ అమ్మాయి బొమ్మ.

ముకుందం మరో ఇరవైమూడురోజులు ఇరవైమూడు స్కెచ్‌లు ఇరవైమూడు వాక్యాలు రాశాక వాణి దక్షిణ భారగదేశ యాతనుంచి తిరిగి వచ్చింది.

12

వాణి ఇండియా వచ్చి ఏడాది దాటుతోంది. అమెరికానుంచి వచ్చే వాళ్ళద్వారా వెంకటేశ్వరరావు వాణికి పార్సిల్స్ పంపిస్తుంటాడు. వాటిలో కేమిసోప్, పెర్ఫ్యూమ్స్, పెన్సిల్స్, లీగల్ పేడ్స్ (గీతలు కొట్టిన పసుపుపచ్చ కాగితం గల పేడ్), అమెరికా వచ్చే వాళ్ళకిచ్చి అక్కడ లోకల్‌గా పోస్టు చేయడానికి అనువుగా కవర్లు, అమెరికన్ స్టాంప్స్ (29సెంట్లు), బట్టలు వంటివి ఆ పార్సిల్స్‌లో ఉంటాయి.

వారంలో కనీసం నాలుగురోజులయినా ముకుందంతో వాళ్ళింటిలో చదరంగం ఆడుతోంది. వాణి అమెరికాలో పుట్టి పెరిగిన అమ్మాయిని ఎవరికీ తెలియదు ఇప్పుడు. ఆమె ఇంగ్లీష్ యాస వింటే తప్ప. లంగా ఓణీల్లో నుదుట బొట్టుతో, జడతో ఉన్న వాణి ఇప్పుడు పదహారణాల తెలుగు అమ్మాయిలా కనిపిస్తుంది. బాబ్డ్ హెయిర్ మాని, జుట్టు పెంచి జడ వేస్తోంది.

ముకుందం వాణి మీద తనకిగల ప్రేమను తెలియచెప్పే ప్రేమ పుస్తకంలో రోజుకో కొత్తవాక్యం రాసి, దానికింద అందుకు సరిపడే బొమ్మను గీసి నింపుతున్నాడు. వాణితో ఎంత పరిచయం వున్నా, ఆమెతో 'ఐ లవ్ యు' అనే సాన్నిహిత్యం తనకు లేదనే ముకుందం నమ్మకం.

బాపన్న, ముకుందం, వాణి కలిసి గోదావరిగట్టుకో, రైల్వేబ్రిడ్జి మీదకో వారానికోసారయినా వెళ్ళి కబుర్లు చెప్పుకుంటారు. బాపన్న అమెరికా గురించి అడిగితే చెపుతూంటుంది వాని.

"మనకి మార్చినుంచి దాకా వేసవికాలం కాని, అమెరికాలో మే నుంచి ఆగస్టుదాకా వేసవి. సెప్టెంబర్‌లో వేసవి సెలవుల తర్వాత కాలేజీలు, యూనివర్శిటీలు తెరుస్తారు. అక్కడ మూడువేల ఆరువందల యూనివర్శిటీలు ఉన్నాయని తెలుసా? ఎనభై లక్షలమంది విద్యార్థులు వాటిలో చదువుతూంటారు. వాళ్ళలో అయిదులక్షలమంది విదేశాలనుంచి వచ్చిన విద్యార్థులు. అందులో ఇండియానుంచి వచ్చినవారి సంఖ్య పాతికవేలు. వీళ్ళుకాక, పార్ట్‌టైము స్టూడెంట్స్ కూడా కొన్ని లక్షలమంది ఉంటారు. అక్కడ వయోపరిమితి లేదు చదువుకి. ముసలివాళ్ళుకూడా విద్యార్థులే. ప్రతి యూనివర్శిటీ 'ఫ్రెష్ మేన్ ఓరియంటేషన్ డే' ని నిర్వహిస్తుంది. ఆ రోజు కొత్తగా చేరిన వారికి బఫే లంచ్ ఇస్తారు."

బాపన్న వాణిని ఓ అమ్మాయిగా కాక, ముకుందలా, ఓ మిత్రుడిని చూసినట్లుగానే చూస్తున్నాడు. ముకుందానికి వాణి అంటే ఎంత ఇష్టం అన్న సంగతికూడా బాపన్న మాటల్లో వ్యక్తం చేస్తుంటాడు. ఆమెకి అవకాశం వచ్చినప్పుడల్లా.

ఎప్పుడు హోటల్‌కి వెళ్ళినా వాణీనే బిల్లు చెల్లిస్తుంది. తమందరికన్నా వాణి ధనవంతురాల్ని మిత్రులిద్దరికీ తెలుసు.

ఓరోజు వాణి మహలక్ష్మి హోటల్‌లో బిల్లు చెల్లించడానికి హేండ్‌బాగ్‌లో నుంచి డబ్బు తీస్తుంటే ఓ ఎయిర్ మెయిల్ కవరు బయటకు వచ్చింది. దాన్ని చూసి చెప్పింది వాణి.

"ఓ, డేమ్ యిది పోస్ట్ చేయాలని నాలుగురోజులనుంచి అనుకుని మరిచిపోతున్నా."

"బయటే పోస్ట్ డబ్బా వుంది. వెళుతూ పోస్ట్ చేద్దాం?" చెప్పాడు బాపన్న.

"ఇది ఫారిన్ లెటర్ కాబట్టి పదకొండురూపాయలు అతికించాను. స్టాంపులకు కక్కుర్తిపడే పోస్టల్ స్టాఫ్ ఉన్నారు. రిజిస్ట్రేషన్ కౌంటరుకి తీసుకెళ్ళి ఇస్తే మనముందే స్టాంపులు కేన్సిల్ చేస్తారు."

"అలాకూడా జరుగుతుందా?" అడిగాడు ముకుందం ఆశ్చర్యంగా.

"మా అమ్మ బంధువులు పెళ్ళికి ఎనిమిది వెడ్డింగ్ కార్డులు పోస్టుచేశారిలా. ఒక్కటీ అమెరికలో ఎవరికీ చేరలేదు. కొందరికి కోపాలు కూడా వచ్చాయి. తమకు కనీసం శుభలేఖ కూడా పంపలేదని. కొత్తల్లో తెలియక నేను పోస్టుచేసిన ఉత్తరాలు కూడా మిస్ అయ్యాయి" అని చిన్నగా నవ్వి చెప్పింది. "పదిపైసల కోసం ఇండియాలో ప్రజలు ఏదయినా చేయడానికి అలవాటుపడ్డారు."

"అమెరికాలో కూడా అంతేనా?" అడిగాడు బాపన్న.

"నెవర్. కవరు, దాని పోస్టేజికయే డబ్బు ఇస్తామక్కడ. పోస్టల్ స్టాఫ్ ఆ స్టాంపుని అతికించి పంపుతారు. దగ్గరుండి అతికించారా లేదా అని చెక్ చేయక్కరలేదు. ఇక్కడి ప్రజలమీదట అమెరికా ప్రజల్లో నీతి నిజాయితీ ఎక్కువ. ఊరికి కొత్తని తెలిస్తే ఆటోని ఊరంతా తిప్పి మీటర్‌లో ఫేర్ పెంచి తీసుకెళ్ళం, కల్తీసరుకు అమ్మిలాభం చేసుకోవడం, ప్రతి పనికీ లంచం పుచ్చుకోవడంలాంటివేమీ అక్కడ ఉండవు. ప్రతివారూ తామూ చేసేపని విషయంలో ఎంతో గర్వంగా ఫీలయి సిన్సియర్‌గా చేస్తారు."

"నీకు ఇండియా ఇష్టమా, లేక అమెరికానా?" అడిగాడు ముకుందం.

వాణి కొద్దిసేపు ఆలోచించి జవాబు చెప్పింది -

"అమెరికా అంటే ఒకందుకిష్టం. వాళ్ళకి ఇక్కడి ప్రజల్లా తోటివారిని దోచుకోవాలనే స్వభావం లేదు. ఒకందుకు ఇండియా అంటే ఇష్టం. ఇక్కడ మనుషుల మధ్య ముఖ్యంగా కుటుంబ సభ్యుల మధ్య బాంధవ్యాలు బాగుంటాయి."

"అక్కడ ప్రతిమనిషి ఓ ఐలెండ్ వృద్ధులైన తల్లిదండ్రులు ఓల్డ్ ఏజ్ డార్మిటరీలలో ఉండాలి తప్ప తమ కుటుంబ సభ్యుల మధ్య ఉండలేరు. అలాగే భార్య భర్తలమధ్య యిక్కడిలా పటిష్టమయిన అటాచ్‌మెంట్ ఉండదు. కోపం వస్తే రూంమేట్స్ వేరే రూములలోకి మారిపోయినట్లుగా, అక్కడ భార్యాభర్తలు విడాకులు తీసుకుని విడిపోతారు. ఎవరి ఇండివిడ్యువాలిటీ వారిది. డబ్బుకిచ్చే ప్రాధాన్యం ప్రేమకు, బంధాలకు ఇవ్వరు."

"పిల్లలకు కష్టం కదా అలా అయితే?"

"బాగా, ఇరవై - ముప్పై ఏళ్ళక్రితం విడాకుల శాతం అక్కడ బాగా పెరిగింది. వాళ్ళకు పుట్టిన పిల్లలు తమ తల్లిదండ్రులు విడిపోవడంవల్ల కలిగే బాధను అనుభవించారు. దాంతో ఇప్పటి జనరేషన్లో విడాకుల శాతం తగ్గిందని అంటున్నారు. తాము విడిపోతే తమ పిల్లలు ఎలా బాధపడతారో వాళ్ళకు అనుభవపూర్వకంగా తెలుసు కాబట్టి సర్దుకుపోయే మనస్తత్వం పెరిగిందట. అలాగే పెళ్ళికి ముందు శారీరక సంబంధాలు కూడా తగ్గుతున్నాయి. అందుకు ఎయిడ్స్ ఓ పెద్ద కారణం."

ముకుందం ఆ ఎయిర్‌మెయిల్ కవరుమీది చిరునామాను అప్పటికే చదివాడు.

"ఎవరీ స్టేన్లీ?" అడిగాడు.

"నన్ ఆఫ్ యువర్ బిజినెస్" చెప్పింది వాణి అమెరికన్ ధోరణిలో

ఆ రాత్రి ముకుందానికి ఎన్నోసార్లు అనిపించింది. ఉత్తరం చదివి పోస్టుచేయాలని. కానీ ఆ పని చేయలేదు. అతని సంస్కారం అడ్డురావడం ఓ కారణం అయితే, మరోటి తను భరించలేని తెలుసుకోవాల్సి రావచ్చన్నది.

చాలాకాలం క్రితం వాణి హేండ్‌బాగ్‌లోంచి జారి కిందపడ్డ కవరు అందిస్తూంటే దానిమీద కూడా అతనిపేరే రాసి ఉండటం ముకుందానికి గుర్తుంది.

మర్నాడు ఉదయం పోస్టు ఆఫీసులోని రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో ఇచ్చాడా కవరు. అతనిముందే దానిమీది స్టాంప్స్‌ని కేన్సిల్ చేశాడు ఆ క్లర్క్.

ఆ రాత్రి వాణి కివ్వాలనుకున్న బుక్‌లో ఈ వాక్యం రాశాడు ముకుందం ఆ రోజు తారీఖువేసి.

"ఇవాళ నీకాళ్ళు అలసిపోయి ఉండాలి. నిన్న రాత్రంతా నీవు నాకలల్లో కదలాడుతూనే ఉన్నావు!"

అంతకు ముందురోజు రాసిన వాక్యం చదివాడు.

"నేను మీ కాఫీలో చక్కెరనవనా?"

మర్నాడు ఆదివారం ఈ వాక్యం రాశాడు.

"రోజూ నీ అందమైన మొహాన్ని అద్దంలో చూసుకునే నీవు ఎంత అదృష్టవంతురాలివి! ఏ ఆదివారం చూద్దామన్నా నాకు నీవు కనిపించవు."

## 13

వాణి అమెరికా నుంచి వచ్చి సంవత్సరంన్నర దాటుతోంది. చూడాలని ఉందని, అమెరికా వచ్చి వెళ్ళమని వాణిని కనీసం ఇరవైసార్లు పిలిచారు ఆమె తల్లిదండ్రులు.

ఏ ఒక్కసారి వాణి సరేననలేదు.

వెంకటేశ్వరరావు అమెరికానుంచి తరచు ఆంధ్రా వచ్చే తమ మిత్రులద్వారా వాణి యోగక్షేమాలు కనుక్కుంటున్నాడు.

ఓ రోజు సుహాసినీ చౌదరి వాణికి ఫోన్ చేసింది విజయవాడ దగ్గరున్న కంకిపాడునుంచి.

తను వచ్చి నెలదాటుతోందని రెండు రోజుల్లో వెళ్ళిపోతోందని వినాయక చవతి వ్రతకల్పం కేసెట్ పంపమని వాణి తండ్రి అడిగారని చెప్పింది.

సుహాసినీ చౌదరి తనకి కొరియర్ ద్వారా ఆ కేసెట్‌ని కొని పంపమన్నది తప్ప తను కొని తీసుకువెళ్ళదలచుకోలేదు.

సుహాసినికి వాణి ఆ కేసెట్ పంపలేదు కాని తండ్రికి ఎయిర్‌మెయిల్‌లో రిజిస్టర్డ్ పోస్టులో పంపించింది.

ఆ వీకెండ్‌కి వాణికి ఫోన్ వచ్చింది వెంకటేశ్వరరావు నుంచి.

"వాణమ్మా! నువ్వు ఇక్కడికి రావడం ఏం చేశావు?" అడిగాడు ఆయన.

ఆయనకు మరీ ప్రేమ కలిగితే వాణిని వాణమ్మా అంటాడు.

"చూద్దాం డేడీ! ఇప్పుడు కుదరదు"

"ఎందుకు కుదరదు? కాలేజీకి వచ్చే వారం నుంచి సెలవులేగా?" అడిగాడాయన.

"సెలవుల్లో చదువుకోవాలనుకుంటున్నాను"

"నీకు అమెరికాకు వచ్చి మమ్మల్ని చూడటం ఇష్టంలేదా?" అడిగాడాయన.

"లేదు" సూటిగా జవాబు చెప్పింది వాణి.

"ఏం?"

"నాకిష్టం లేకపోయినా నన్నిక్కడికి పంపించారు స్టేన్లీ కారణంగా. అతనింకా అక్కడే ఉన్నాడుగా అందుకని రాను. నన్ను చూడాలనుకుంటే మీరే ఇక్కడికి రండి"

"అంతా రావాలంటే ఖర్చు అవుతుంది"

"జన్మభూమికి రావడానికి అయ్యే ఖర్చు పెట్టదగ్గ ఖర్చు డాడీ !"

"యు ఆర్ ఏ స్టుపిడ్ఆ ఫ్ ఏన్ ఏస్!"ఆ యన కోపంగా.

చిన్నగా నవ్వి, జవాబు చెప్పింది వాణి.

"ఎస్, థాంక్స్"

తన విషయంలో వాణి అభిప్రాయం ఏమిటో, ఆమె మనసులో ఏం ఉందో ముకుందానికి అర్థం కాలేదు. అదే మాటను చెప్పాడు అతను బాపన్నతో. ఆలోచించి బాపన్న ఓ సలహా ఇచ్చాడు.

"రిజెక్షన్ స్లిప్ వస్తే మరేం ఫర్వాలేదు కాని నీ మనసులో మాట చెప్పెయ్. నో అంటే ఇంకో పుల్లమ్మని వెదుక్కోవచ్చు."

తల అడ్డంగా ఊపాడు ముకుందం.

"అది భరించలేను నేను. వాణిని చూస్తున్న కొద్దీ ఆ అమ్మాయి మీద ఇష్టం అధికమవుతోంది"

"అయితే చూడకు"

"చూడకుండా ఉండటం నా వల్లకాదు"

"నీకు యిదేం పిచ్చిరా? చూస్తే ఓ తంటా. చూడకుంటే ఓ తంటా"

"అదే ప్రేమంటే"

"అయితే గట్టి చిక్కే? మనం ప్రేమిచే అమ్మాయి మనల్ని ప్రేమించకపోతే మహా ఇబ్బందేనన్నమాట."

"బాగా"

తన ప్రేమను ఓ పుస్తకంలో రోజు ఓ వాక్యంగా అక్షర రూపంలోకి అనువదిస్తూండటం ముకుందానికి పెద్ద ఉపశమనంలా ఉంది. అదీ లేకపోతే, అతని జీవితం ఎంతో డల్‌గా ఉండేది. ఏనాటికైనా తను ఆ పుస్తకాన్ని వాణి చేతి కిస్తాడని, ఆమె అది చదివి తన ప్రేమను అంగీకరిస్తుందని అతని ఆశ.

ఎడారిలో ఒయాసిస్‌లాంటిది ప్రేమికుడి ఆశ.

14

ఆ రోజు వినాయకచవితి. అమెరికాలోని సెయింట్ లూయీలోని వెంకటేశ్వరరావు తన కుటుంబంతో వినాయకుడి పూజకు కూర్చున్నాడు. కురవక పత్రం, మాచీ పత్రం, బిల్వ పత్రం, దూర్వాయుగ్మం దత్తూరపత్రం, బదరీ పత్రం, చూత పత్రం, కరవీరపత్రం, శమీ పత్రంలాంటి పత్రాలు వెదికి సంపాదించడం కష్టం కనుక ఊరు బయట ఏ చెట్టు ఆకులు దొరికితే అవి కోసి తెచ్చాడాయన.

పట్టుబట్ట కట్టుకుని ఇండియా నించి తెప్పించుకున్న వినాయక వ్రతకల్పం కేసెట్‌ని పెట్టుకుని పూజని ప్రారంభించారు. ప్లే బటన్‌ని నొక్కగానే శ్రావ్యమైన కంఠం గంభీరంగా వినిపించసాగింది.

పుష్పమాలతో, అన్ని రకములైన విడిపువ్వులతో పత్రిమాలతో ఇప్పుడు స్వామివారిని పూజించవలెను.

అథాంగపూజ... ఓం గణేశాయనమః పాదే పూజయామి

ఓ ఏకదాంతాయ నమః.. పూజయామి

ఓ శూర్పకర్ణాయనః

ఆ ప్రకారం ఏపిల్ ఆకులతో, సీడర్ ఆకులతో, ఆలివ్ ఆకులతో, పైన్ ఆకులతో విఘ్నేశ్వర విగ్రహానికి భక్తితో పూజ చేయసాగారు.

"ధూప దీపానంతరం ఆచమనం సమర్పయామి కొద్దిగా ఉదకం పళ్ళెంలో వదిలిపెట్టండి."

ఆ ప్రకారం చేశారు వెంకటేశ్వరరావు, లక్ష్మి.

యథావిధిగా వినాయకపూజ, ప్రాణ ప్రతిష్ట, షోడశోపచారపూజ, అంగపూజ, అష్టోత్తరపూజ, ఏకవింశతి వ్రతపూజ, దుర్వాయుగ్మ పూజ, కర్పూర పూజలు చేశారు. ఆ తర్వాత వ్రతకథని అంతా శ్రద్ధగా విని, అక్షింతలు నెత్తిన చల్లుకున్నారు.

అయితే సంకల్పం చెప్పుకునేటప్పుడు మాత్రం ఇండియాకి, అమెరికాకి కొంత తేడా ఉంది.

"శుభే శోభన ముహూర్తే ఆద్య బ్రాహ్మణ ద్వితీయ పరార్థే. శ్వేతవరాహ కల్పే, వైవస్వత మన్వంతరే, కలియుగే, ప్రథమపాదేణ అమెరికా ద్వీపే, అమెరికా వర్షే, యునైటెడ్ స్టేట్స్ ఖండేణ మిసిసిపి త్సూజి మధ్య ప్రదేశే, శోభన గృహే సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ, అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన ప్రభవాది షష్టి సంవత్సరాణాం మధ్యే, నైన్టీన్ నైన్టీ త్రీ సంవత్సరే, వర్షఋతౌ, ఆగస్ట్ మాసే, శుక్లపక్షే, చతుర్థ్యాం శుభ తిథౌ, గురువారే శున నక్షత్రే, శుభయోగే, శుభ కరణే ఏవంగుణ...

తమ మధ్య వాణి లేనందుకు ఆ కుటుంబసభ్యులంతా సమానంగా బాధపడ్డారు.

తెల్లవారుఝామున అయిదున్నరకి ఫోన్ మోగితే రిసీవర్ అందుకున్న ఆమె తాతయ్య శివయ్య వాణిని నిద్రలేపి చెప్పాడు.

"మీ నాన్న తల్లీ!"

వాణి వెంటనే రిసీవర్ అందుకుంది. ఆ సమయంలో తను ఇండియా వచ్చిన రెండేళ్ళలో తన తండ్రి ఎన్నడూ ఫోన్ చేయకపోవడంతో ఆమెకు మత్తు పోయింది.

"హాయ్ డేడ్!" చెప్పింది.

"హలో వాణీ! మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే!" వాణికి పుట్టిన రోజు శుభాకాంక్షలు చెప్పాడు వెంకటేశ్వరరావు అవతల్నించి.

"ఓ థాంక్స్ డేడీ. థాంక్స్"

తర్వాత మాట్లాడింది ఆమె తల్లి లక్ష్మి.

"మేట్నీకి సినిమాకి వెళుతున్నాను. ఫ్రెండ్స్‌ని హోటల్‌కి తీసుకెళతాను. నథింగ్ మోర్ దేన్ దట్!"

తన కుటుంబ సభ్యులందరితోనూ మాట్లాడింది వాణి.

ఉదయం సంగీత కుంకుడుకాయ రసంతో తలంటి పోసుకోవడంలో వాణికి సహాయం చేసింది. రోజులా జడ వేసుకుని ఓ గులాబి పువ్వు జడలో పిన్నీసుతో పెట్టుకుంది. తన క్లాస్‌మేట్స్‌లో ముఖ్యులను నలుగురిని సినిమాకి తీసుకెళ్ళింది. తర్వాత హోటల్‌కి.

ముకుందం తల్లితో చెప్పింది వాళ్ళింటికి వెళ్ళాక ఆ రోజు తన పుట్టినరోజని.

"అరెరే! నిన్న చెప్పలేదే!" అని ఆవిడ అప్పటికప్పుడు కొబ్బరి లౌజు తయారుచేసి పెట్టింది వాణికి.

"ఎన్నేళ్ళు వెళ్ళి ఎన్నేళ్ళు వచ్చాయి?" అడిగాడు ముకుందం విషెస్ చెప్పాక.

"పదహారెళ్ళి పదిహేడు వచ్చాయి"

ముకుందం మొదటిసారిగా తనను చూసిన వాణిని గుర్తుతెచ్చుకుని తనకళ్ళముందున్న వాణితో పోల్చి చూసుకున్నాడు.

రంగు తగ్గింది. లావు కూడా తగ్గింది. అప్పటికన్నా, నాజూగ్గా, అందంగా ఉంది వాణి.

"అమెరికాలో పుట్టినరోజున ఏం చేస్తావు?" అడిగాడు బాపన్న.

"లాట్సాఫ్ ఫన్! జాయ్ రైడ్స్‌కి వెళ్ళేదాన్ని. పిజ్జా హాట్‌లో పిజ్జా తినేదాన్ని. అక్కడ పిజ్జా చాలా బాగుంటుంది. మూవీకి వెళ్ళేదాన్ని. ఫ్రెండ్స్ బర్త్‌డే గిఫ్టులు ఇచ్చేవారు"

మర్నాడు ఫెడరల్ ఎక్స్‌ప్రెస్‌లో అమెరికానుంచి పెద్ద గ్రీటింగ్ కార్డ్ వచ్చింది వాణికి కాలేజీ అడ్రస్‌కి.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

**ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి**

Post your comments